# కోర్టుపక్షి

ఆ ఆవరణలో ఎనిమిది గాబోలు మేజిస్ట్రేటు కోర్టులున్నాయి. నేను సాక్షిగా హాజరు కావలసిన కోర్టు ఆరట. నన్ను తీసుకువచ్చిన టి.ఎస్.163 - పోలీసు భటుడికి పేరుండదు, అంకె తప్ప - చూపుడు వేలితో ఆ కోర్టు చూపించి వెళ్ళిపోయాడు, టీకి కాబోలు. కోర్టులో అంగుళం ఖాళీలేదు. చిల్లరకేసుల జనంతో క్రిక్కిరిసి ఉంది. రెండు బెంచీలూ లాయర్ల కోసమట. అంచేత రవంత ఖాళీ ఉన్నా అక్కడ కూర్చోడానికి వీల్లేదు. బయటికి వచ్చాను.

మే ఎండ మొగంమీద మొత్తింది. లోపల ఒక నడివయస్కురాలు, తన్ను ఫలానా ఆసామీ ఎలా మభ్యపెట్టి, బట్టలు ఒలిచివేసి, తదుపరి కార్యక్రమం ఎలా ముగించాడో, కొంత కసి, కొంత సంతృప్తి కలిసిన గొంతులో, తమిళ భాషలో వర్ణిస్తుంటే, మేజిస్ట్రేటు ఆసక్తితో వింటున్నాడు. బయట ఒక దుకాణదారు ఒక లాయర్ని కొట్టబోయి, నలుగురు పట్టుకోవడంతోటే, ఆ లాయరు అమ్మనీ, భార్యనీ, ఇంకా ఎవరైనా ఆడబంధువులుంటే వాళ్ళనీ, తను ఏం జెయ్యదలుచుకున్నాడో ఉద్రేకంతో చెపుతున్నాడు. సదరు లాయరు అతనివద్ద ఫీజు పుచ్చుకుని, తరవాత పోలీసులతో లాలూచీపడి, అతనికి నూటయాభై జరిమానా వేయించాట్ట. ఏ నేరానికో నాకు అర్థం కాలేదు. వినాలన్న కోరిక, వినే ఓపిక నాకు లేవు. ఒకటే దాహం. బడ్డీకొట్టు ముందు ఆరంగుళాల నీడలో నిలబడి సోడా పదిపదిహేను నిముషాలు తాగాను, బడ్డికొట్టువాడు చిరాకుపడి పొమ్మనీదాకా. ఆవరణలో ఎన్నో చెట్లూనీడలూ ఉన్నాయి గాని, అక్కడ నిలబడ్డానికి ఆస్కారం లేదు. ఆ నీడల్లో వేలాది చీమలు పుట్టలు నిర్మించుకుని, వలస ఆధిపత్యం స్థిరపరుచుకున్నాయి. ఇతర జాతులవాళ్ళు అడుగుపెడితే ఆత్మరక్షణ కోసం దాడి ప్రారంభిస్తాయి.

నాది మూడేళ్ళనాటి కేసు. ఒకరాత్రి నిద్రపోతున్న గది గలుపు తన చాకచక్యంతో తెరిచి, ఒక దొంగ రెండు ట్రాన్సిస్టర్లు, టేప్‌రికార్డర్లు, డ్రాయర్లో ఉన్న నూటయాభై రొక్కం పట్టుకుపోయాడు. పొద్దున్నే లేవగానే ఆవేశపడి, ఆత్రపడి పోలీసువారికి ఫోన్‌చేసి రప్పించి, పోయినవాటి వివరాలతో సహా ఫిర్యాదురాసి ఇచ్చి, పోయిన సరుకు దొరికిపోయినంత సంతృప్తిపడ్డాను. ఆ తరవాత క్రమంగా ఆ సంగతే మరిచిపోయాను. ఏడాదిక్రితం పోలీసులు రెండు టేప్‌రికార్డర్లనీ, దొంగనీ మా ఇంటికి తీసుకొచ్చారు - వాటిమీద అంకెలు రిపోర్టులో అంకెలతో సరిపోయాయి. నా సరుకు నాకు దొరికినందుకు సంతోషం, పోలీసువాళ్ల సమర్థతకు ఆశ్చర్యం కలిగాయి నాకు. అయితే వాటిని తిరిగి పొందడానికి తంతు ఉందట. కోర్టుకి ఎప్పుడు రావాలో వాళ్లే తెలియజేస్తామన్నారు పోలీసులు.

వాకబు చెయ్యగా తెలిసిన విషయం : ఆ ఆసామీ - వీరాస్వామి - పట్టణంలో మరోచోట, ఏణ్ణర్థంక్రితం, ఒక ఇంట్లో ప్రవేశించి, ఒక ముసలిఅవ్వ మెడలో గొలుసు దొంగిలించే ప్రయత్నంలో ఆమెను చంపడం జరిగిందట. ఆ హత్య దర్యాప్తు చేస్తుండగా, ముసలిఅవ్వ గొలుసుతోపాటు రకరకాల ఇళ్లలో పోయిన సరుకులు, టేప్‌రికార్డర్లు, వాచీలు, మిక్సర్లు, బ్రీఫ్‌కేసులు దొరికాయట. హత్యానేరం కాక అతనిమీద ఎనిమిది

చిల్లరకేసులున్నాయట. హత్యానేరంలో అతనికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది. ఇంక మిగిలిన ఎనిమిది కేసులూ విచారించి శిక్ష విధించాలట. హత్యానేరం విచారణ ఏడాదిపట్టింది, ఏ కారణంవల్లనో.

ఒకరోజు సాయంత్రం ఎక్కడో తిరిగి అలసిపోయి ఇంటికి తిరిగి వచ్చేసరికి, కోర్టువారి తాఖీదు – మరునాడు 6వ మేజిస్ట్రేటు కోర్టులో నేను హాజరుకావాలని. టేప్‌రికార్డర్లు దొరుకుతాయన్న ఆశకొద్దీ, మావాళ్లంతా బలవంతం జేసి, నన్ను పంపారు. పదిగంటలకు వెళ్ళినవాణ్ణి, సాయంత్రం మూడు గంటలవరకూ చూశాను. వీరాస్వామి మరో ఊరి జైల్లో ఉన్నాట్ట. అతను రావడానికి – అంటే పోలీసు బందోబస్తుతో రావడానికి – ఏదో ఆటంకం వచ్చిందట. సర్కారు ప్లీడరు కేసువాయిదా వెయ్యమని మేజిస్ట్రేటుని అడిగాడు. నా కష్టసుఖాలు రవంతైనా వాకబు చెయ్యకుండానే, మేజిస్ట్రేటు మరో నెల తరవాతకి కేసు వాయిదా వేశాడు.

రెండో వాయిదా రోజుని వీరాస్వామిని పోలీసులు హాజరు పెట్టారు. మేజిస్ట్రేటు అతను నేరం ఒప్పుకున్నా, కోర్టువారు శిక్ష విధించినా, యావజ్జీవ శిక్షలో కలిసిపోతుందనీ, అంచేత మిగతా నేరాలన్నీ తను చేసినట్టు ఒప్పుకుంటే అందరికీ సుఖమనీ అన్నాడు. వీరాస్వామి మెత్తగా చిరునవ్వునవ్వుతూ, ప్రతి కేసునీ ప్రతిఘటించే హక్కు తనకు ఉందన్నాడు. ఈసారి అతడూ వాయిదా కోరాడు. మేజిస్ట్రేటు సరేనన్నాడు, నాతో నిమిత్తం లేకుండానే.

ఈ వాయిదాకి వెళ్ళకూడదని గట్టిగా తీర్మానించుకునే, నేను నాలుగు వాయిదాలకు హాజరయాను – నా సాక్ష్యం మళ్లీ వాయిదా పడుతూనే వచ్చింది. ఇది ఆఖరు వాయిదా అని ఖచ్చితంగా నచ్చజెప్పి, నన్నీ వాయిదాకి తీసుకొచ్చారు పోలీసులు. నేను సాక్ష్యం ఏం చెప్పాలో బోధపరిచాడు సర్కారు ప్లీడరు. ఆ సంభాషణలో ఒకటే టేప్‌రికార్డరు – దాని కంపెనీ పేరు, అంకె వివరించాడు. రెండో టేప్‌రికార్డరు సంగతి ఏమిటని అడిగాను. అసలు ఆ సంగతి తామింతవరకూ వినలేదన్నట్టు అజ్ఞానం నటించారు ప్లీడరూ పోలీసులూ. అప్పటికి ఇంకా ఎండ ముదరకపోయినా, నా కడుపులో వేడెక్కింది. ఆ తరవాత వీరాస్వామి రాకకోసం ఎండలో ఎదురుచూస్తూ నిలబడడంవల్ల, బుర్ర వేడెక్కింది. వీరాస్వామిని రాజమర్యాదల్తో వాన్‌లో తీసుకొచ్చి ఒక చల్లని షెడ్‌లో పెట్టారు. ఆ తరవాత అతని భోజనం, విశ్రాంతి. నాకు మెదడులోనూ కడుపులోనూ ఒకటే మంట. వీరాస్వామి ప్రయాణపు బడలిక, భుక్తాయాసం తీర్చుకున్నాక, రెండున్నర గంటలకు అతన్ని సాదరంగా కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ తరవాత అరగంటకు నన్ను పిలిచారు. ఆకలితో దాహంతో ఉక్రోషంతో తలక్రిందులైపోతున్న నాకు, ఆ పిలుపు వినబడలేదు. నాపక్కని బీడీతాగుతున్న ఆసామీ నన్ను భుజంతట్టి లోపలికి పంపాడు. అతనికి నా పేరెలా తెలుసో నాకర్థం కాలేదు.

కోర్టులో అడుగుపెట్టగానే కళ్ళు తిరిగాయి. బోనులోనే అలా పడుకుని నిద్రపోవాలనిపించింది. 'దేవుని ఎదుట' వగైరా ప్రమాణం అయిందనిపించాడు గుమాస్తా. ఆ తరవాత క్లుప్తంగా జరిగింది నాచేత చెప్పించాడు సర్కారు ప్లీడరు, తన ప్రశ్నల ద్వారా. తరవాత ప్రశ్న – ఆ రోజు మా యింటికి టేప్‌రికార్డరుతో సహా (ఏక వచనం మీద ఒత్తాడు) పోలీసులు తీసుకు వచ్చిన ఆసామీ ఎదురుగా నిలబడ్డ వీరాస్వామేనా?

అని అడిగాడు. టేప్ రికార్డరు ఏకవచనం మీద అంతగా వత్తి ప్లీడరు అడగడంతోటే, నాకు చిర్రెత్తింది. అంతవరకు అణచిపెట్టిన చిరాకూ, కోపం, అసహాయత బుర్రలో గింగురుమన్నాయి. నాకు తెలియదన్నాను. మళ్ళీ నొక్కి అడిగాడు ప్లీడరు. రెండేళ్ళ క్రితం ఒక పావుగంటసేపు చూసిన ముఖాన్ని మీరు గుర్తుపట్టగలరా? అని ప్లీడర్ని అడిగాను. మేజిస్ట్రేటు అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పాలిగాని, ఎదురుప్రశ్న వెయ్యకూడదని హెచ్చరించారు నన్ను. దేవుని ఎదట నిజమే చెబుతానని ప్రమాణంచేసి, అబద్ధం చెప్పలేననీ, వీరాస్వామే ఆరోజున మా యింటికి తీసుకురాబడ్డ వ్యక్తి అని ఖచ్చితంగా చెప్పలేననీ అన్నాను. వీరాస్వామి గర్వంగా కోర్టువంక చిరునవ్వు విసిరాడు. సర్కారు ప్లీడరు, పోలీసులు ఒక్కక్షణం సంప్రదించుకున్నారు. తరవాత ఒక టేప్‌రికార్డరు నా ఎదట పెట్టారు. ఇది నీదేనా అని అడిగాడు ప్లీడరు. నాదేనన్నాను. రుజువేమిటన్నాడు. కంపెనీ పేరూ, నంబరూ, దానిమీద ఉంటాయన్నాను. కంపెనీ పేరు ఉందిగాని, నంబరుండవలసినచోట ఆకురాయితో రాసేసి ఉంది. ఆ తరవాత ప్లీడరు కసిగా నాకూ వీరాస్వామికీ లోపాయికారీ సంబంధమున్నట్టూ, అతన్ని రక్షించడంకోసం నేను అబద్ధాలు చెపుతున్నట్టూ, సూచిస్తూ ప్రశ్న అడిగాడు. నాకిక కోపం ఆగలేదు. ఏమిటీ కోర్టన్నాను. ఏమిటీ న్యాయమన్నాను. సొమ్ము పోగొట్టుకున్నవాణ్ణి నేరస్థుడ్ని చేసి, ఎండలో నిలబెట్టి, హింసపెట్టి నా రెండు రికార్డర్లలో ఒకటి పోలీసు వాళ్ళు కొట్టేసి, ఉన్నదికూడా నాది కాదని కోర్టులో నిరూపిస్తుంటే, ఇంక ఈ కోర్టులెందుకన్నాను. ఆ ఆవేశంలో మొత్తం కోర్టుల్నీ, పోలీసు డిపార్టుమెంటునీ, ప్లీడర్లనీ కడిగిపారేశాను. ఆవేశం చటుక్కున నీరసంగా మారిపోయింది. మేజిస్ట్రేటు కోర్టుని అవమానపరిచినందుకు కోర్టు లేచేదాకా అక్కడే ఉండాలని శిక్ష విధించాడు. 'అమ్మయ్య, నేరస్థుణ్ణి గనక కోర్టులోపల ఉండొచ్చు - ఎండలో చావక్కర్లేదు' అన్నాను కసిగా. అయితే నా ఏవగింపు ఎవరినీ రవంతైనా కదిలించినట్టు లేదు. అతని పక్కన కూర్చోగానే వీరాస్వామి చిరునవ్వు నవ్వుతూ, 'You're a fool' అన్నాడు ఇంగ్లీషులో. అది భూతకాలమో వర్తమాన కాలమో నాకు అర్థం కాలేదు. చెప్పరాని దిగులు, నామీద నాకే జాలి కలిగాయి. 'కోర్టు పక్షిని చూడు - వాణ్ణి చూసైనా నేర్చుకో' అన్నాడు వీరాస్వామి - ఇంగ్లీషులోనే. చూశాను.

అతను బీడీ కాలుస్తూ నా భుజం తట్టిన ఆసామీ. ఈ నాలుగయిదుసార్లు కోర్టుకి వచ్చినప్పుడల్లా అతన్ని చూస్తూనే వచ్చాను. అతను ఏ ప్లీడరు గుమస్తానో, పోలీసు గుమాస్తానో అనుకున్నాను. అతని సాక్ష్యం అతిస్పష్టంగా ఉంది. వీరాస్వామే తన ఇంటికి ఆరోజు పోలీసులు తీసుకువచ్చిన దొంగ అనీ తన ఇంట్లో పోయిన టేప్‌రికార్డరు ప్లీడరుగారి చేతిలో ఉన్నదేననీ పచ్చి నిజంలాగ చెప్పేశాడు. ఆ టేప్‌రికార్డరు అతనిదనీ, అతని ఇంట్లోంచే వీరాస్వామి దాన్ని దొంగిలించాడనీ కోర్టువారికి రుజువైపోయింది. వీరాస్వామి ఎదురుప్రశ్నలు ఎన్నివేసినా అతను చలించలేదు. ఆ తరవాత కోర్టు అయినదాకా వీరాస్వామి - ఆ కోర్టుపక్షి సంగతి చెపుతూనే ఉన్నాడు. పోలీసువారికే కాకండా, వాదిప్రతివాదులకీ డబ్బుచ్చుకుని సాక్ష్యాలు చెపుతుంటాడట. నెలకు వెయ్యి పదిహేనువందలు వరకూ సంపాదిస్తూంటాడట. అందరు కోర్టు అధికారులకూ అతను తెలిసినా, అబద్ధపు సాక్ష్యం చెప్పినట్టు ఎవరూ రుజువు చెయ్యలేకపోయారట. కోర్టు కిటుకులు అతనికి చాలా బాగా తెలుసట. ఇలాంటి వృత్తి నేను చెయ్యగలనా? అని ప్రశ్నించుకున్నాను. అతనిమీద ఈర్ష్యలాంటి గౌరవం కలిగింది.

సాయంత్రం అయిదున్నర. డజను అరటిపళ్లు కొని తిన్నాను. కోర్టు ముగియగానే ఇంటికి పోవాలనిపించలేదు. నేనేదో తప్పుచేసినట్టు, ఇంట్లో నా ముఖం చూపించలేనట్టూ అయిపోయింది. ఇంతలో మేజిస్ట్రేటుగారు ఇవతలికి వచ్చి రిక్షా ఎక్కుతున్నారు. దగ్గరగావెళ్ళి నమస్కారం అన్నాను. ఆయన అతి వినయంగా ప్రతి నమస్కారంచేసి 'ఎవరు బాబూ మీరు' అని అడిగారు. నేను కసిగా – 'మూడు గంటల క్రితం నాకు కోర్టుని అవమానపరచిన నేరానికి శిక్ష విధించారు. ఇంతలోనే మరిచిపోయారు. రెండేళ్ల క్రితం నేను చూసిన ముఖం నాకు గుర్తు లేదంటే, నేను కావాలని అబద్ధం చెప్పానన్నారు –' అనేశాను. ఆయన ఎవరో పిచ్చివాణ్ణి చూసినట్టు నావంక చూసి వెళ్లిపోయారు – నిట్టూర్చాను. ఇంటికి పోదామని బయలుదేరాను.

గట్టిగా ఎవరో నన్ను పేరెట్టి పిలిచారు. ఆగాను. పిలిచింది కోర్టు పక్షి. అతను హడావుడిగా వచ్చి టేప్‌రికార్డర్ నా చేతిలో పెట్టాడు. నాకేం బోధపడలేదు. ఆటో ఎక్కి వెళ్ళిపోదామని నన్ను తొందరపెట్టాడు. ఇంతలో ఒక కానిస్టేబుల్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఆ టేప్‌రికార్డరు ఇవ్వమని తమిళంలో అడిగాడు. కోర్టుపక్షి అది నాదనీ, పై అంకె చెరిపేసినా, బాటరీలమీద అసలు నంబరు ఉందనీ, కావాలంటే చూసుకోమనీ అన్నాడు. కడుపులో మంటంతా కళ్లలోనే ఆపుకుని కానిస్టేబుల్ నిలబడిపోయాడు. ఇంతలో ఆటో వచ్చింది. నాతోపాటు ఎక్కాడు కోర్టుపక్షి. ఆటో పోతోంది. టేప్‌రికార్డరు అతనికి తిరిగి ఇవ్వబోయాను. అతను – 'మీరు వట్టి సత్తెకాలపు మనుషులండీ –' అని. అది తన ఇంట్లో ఉంటే పోలీసులు వచ్చి సోదాచేసి, నా సొత్తు అతను దొంగిలించినట్టు కేసుపెట్టి నన్నే సాక్ష్యానికి పిలుస్తారని చెప్పారు. మరి అతన్ని పోలీసులు విడిచి పెట్టారా అని అడిగాను. దొంగసొమ్ము నా దగ్గరుంటేకదా – అన్నాడు. మరి మిమ్మల్ని మళ్ళీ సాక్ష్యానికి పిలవరేమో. అదే మీ జీవనోపాధిగదా – అన్నాను. నాకు పై అధికారులతో పరిచయముంది. వాళ్ల దగ్గర ఈ క్రింది పోలీసులు చేసిన అవకతవకలు బయటపెడితే, వీళ్ల ఉద్యోగాలకు మోసం. అందుకని నాజోలికి రారు. పైగా పోలీసు కేసుకి నాకు ముట్టేది పది రూపాయలే. ప్రైవేటు కేసులయితే, వంద, రెండువందలు కేసునిబట్టి – అన్నాడు. నేను డబ్బు ఇవ్వబోయాను. నాకు నమస్కారం పెట్టి వద్దన్నాడు. నా సొమ్ము నాకివ్వడానికి తను లంచం పుచ్చుకోలేనన్నాడు. తన్ను మౌంట్ రోడ్డులో దింపితే చాలన్నాడు.

–బోనులో నిలబడి అబద్ధాలు చెప్పడం భుక్తికోసం, ఇవతలైనా న్యాయంగా నడుచుకోకపోతే దేవుడు హర్షిస్తాడా బాబూ? పిల్లా జెల్లా కలవాణ్ణి – అన్నాడు కోర్టు పక్షి.

కోర్టులో న్యాయం సంగతి ఏమయినా, ఈ కోర్టుపక్షిలో ఈ మాత్రం న్యాయబుద్ధి ఉన్నందుకు నేను సంతోషించాను.

●